క్లుప్తంగా

చెత్త నుంచి ఎరువు తయారీ



తడకనపల్లెలో ఎస్‌డబ్ల్యూపీసీని పరిశీలిస్తున్న డీపీఓ నాగరాజు నాయుడు

కల్లూరు: చెత్త సంపద తయారీ కేంద్రం (ఎస్‌డబ్ల్యూపీసీ) నుంచి ఎరువును తయారు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి నాగరాజు నాయుడు అన్నారు. శనివారం తడకనపల్లె గ్రామంలోని ఎస్‌డబ్ల్యూపీసీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామాల్లో పారిశుధ్య కార్మికులు తడి, పొడి చెత్తను వేరు వేరుగా సేకరించాలన్నారు. చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.డీపీఓ వెంట తడకనపల్లె గ్రామ పంచాయతీ కార్యదర్శి చైతన్య ఉన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి



కంబదహాల్‌లో గృహ లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఏఈ సుమంత్

సి.బెళగల్: గ్రామాల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ ఏఈ సుమంత్ అన్నారు. శనివారం ఆయన హౌసింగ్ సిబ్బందితో కలిసి కంబదహాల్ గ్రామంలో పర్యటించారు. లబ్ధిదారులతో మాట్లాడి గృహాలు త్వరగా నిర్మించుకోవాలని సూచించారు. అనంతరం స్థానిక జగనన్న కాలనీని సందర్శించి గ్రామ వలంటీర్లు, లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులకు నోటీసులు జారీ చేస్తామన్నారు. హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ రంగన్న, నాగేష్ పాల్గొన్నారు.

14న ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న సి. బెళగల్ ఈఓఆర్డీ సందీప్

సి.బెళగల్: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా ఈనెల 14న పాఠశాలల్లో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేయనున్నట్లు ఈఓఆర్డీ సందీప్ తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో డీవార్మింగ్ డే నిర్వహణపై ఆరోగ్య, విద్య, స్త్రీ శిశు సంక్షేమ శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలలో చదువుకుంటున్న 11 వేల మంది విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎంఈఓ జ్యోతి, పోలకల్, సి.బెళగల్ పీహెచ్‌సీల డాక్టర్లు హరిచంద్రుడు, సునీత, వైద్య అధికారులు, సిబ్బంది, ఉపాధ్యాయులు ఉన్నారు.

స్థానికులకే ప్రాధాన్యత ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న గిడ్డయ్య

ఓర్వకల్లు: మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న పరిశ్రమల్లో స్థానిక యువతకు ప్రాధాన్యమిచ్చి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య కోరారు. శనివారం మండల కేంద్రం పొదుపు భవన్‌లో ఆ పార్టీ మండల మహాసభ జరిగింది. మండల కార్యదర్శి దస్తగిరి అధ్యక్షతన జరిగిన ఈ సభలో జిల్లా కార్యదర్శి గిడ్డయ్య మాట్లాడుతూ ప్రజా సమస్యలపై పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో ఓర్వకల్లు ప్రాంతానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని, ఇక్కడ అనేక పరిశ్రమలు ఏర్పాటు కాబోతున్నాయని చెప్పారు. అనంతరం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఇందులో మండల కార్యదర్శిగా సుధాకర్, సహాయ కార్యదర్శిగా మహబూబ్‌బాషా, మరో 9 మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మానసిక ఒత్తిడికి గురి కాకూడదు

కర్నూలు సిటీ: పరీక్షలకు సన్నద్ధం అవుతున్న విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురి కాకూడదని రవీంద్ర విద్యా సంస్థల చైర్మన్ జి.వి.ఎం మోహన్ కుమార్, అకాడమిక్ అడ్వైజర్ డా.మమతా మోహన్, గణిత శాస్త్ర నిపుణులు ఈశ్వరయ్యలు అన్నారు. శనివారం రవీంద్ర విద్యా సంస్థల్లో 10వ తరగతి పరీక్షలకు హాజరు అవుతున్న విద్యార్థులకు పరీక్షలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంత వాతావరణంలో పాజిటివ్ ఆలోచనలతో ఉండాలన్నారు. ఎలక్ట్రానిక్స్ పరికరాలకు దూరంగా ఉండాలని, చదివిన అంశాలను చక్కగా రాయడంతో మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పెసరవాయిలో ఆవుకు గాలికుంటు నివారణ టీకా వేస్తున్న వైద్యుడు బాబా ఫక్రుద్దీన్



టీకాతో రక్షణ!

- పశువుల సంరక్షణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- గాలికుంటు వ్యాధి నివారణకు ఉచితంగా టీకాలు
- ఈనెల 31 వరకు నిర్వహణ

గడివేముల: ఇటీవల కాలంలో పశువులకు పలు వ్యాధులు ప్రబలుతున్నాయి. దీంతో పాల ఉత్పత్తి తగ్గడంతో పాటు పశునష్టం జరుగుతుండటంతో ప్రభుత్వం నివారణ చర్యలు చేపట్టింది. ప్రధానంగా అవులు, గేదెలకు సోకే వ్యాధుల్లో ప్రమాదకరమైంది గాలికుంటు వ్యాధి. ఈ వ్యాధి ప్రస్తుతం లేకపోయినా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది. ఈ వ్యాధిని కలగజేసే వైరస్ గాలి ద్వారా త్వరగా ఇతర ప్రాంతాలకు వ్యాపిస్తుంది. ఈ నేపథ్యంలో పశుసంవర్ధకశాఖ ముందు జాగ్రత్తగా వ్యాధి నివారణ టీకాలు వేస్తోంది. మార్చి 1వ తేదీన ప్రారంభమైన ఈ కార్యక్రమం ఈనెలాఖరు వరకు కొనసాగనుంది. నియోజకవర్గ పరిధిలోని గడివేముల మండలంలో 18,258, ఓర్వకల్లులో 1,07,229, కల్లూరులో 60,233 పాణ్యంలో 13,487 ఆవులు, గేదెలు ఉన్నాయి. వీటన్నింటికీ టీకాలు వేసేందుకు పశువైద్యాధికారులు చర్యలు చేపట్టారు. మండలంలో ఈ కార్యక్రమం చురుగ్గా సాగుతోంది.

నివారణ ఇలా...

వ్యాధి సోకిన పశువులను మంద నుంచి వేరు చేయాలి. ప్రస్తుతం గాలికుంటు కేసులు ఎక్కడా నమోదు కాలేదు. అయితే, ఈ వ్యాధికి చికిత్స వ్యయ ప్రయాసతో కూడుకున్నందున నివారణ మార్గాలపై శ్రద్ధ వహించాలి. గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు ముందుజాగ్రత్తగా ఏడాదికోసారి క్రమం తప్పకుండా వేయించాలి. టీకాలు వేసిన తర్వాత 1-3 వారాల్లో వ్యాధి నిరోధక శక్తి పెంపొంది ఏడాది పాటు వ్యాధి సోకకుండా ఉంటుంది. నిండు చూడిగా ఉన్న పశువులను ఈనిన తర్వాత టీకాలు వేయిస్తే మంచిది. ఈ వ్యాధి అన్ని కాలాల్లో కనిపిస్తుంటుంది. అందు వల్ల ప్రతి ఏటా పశువులకు అన్ని వైరస్ స్ట్రెయిన్‌లతో కూడిన టీకాలు వేయించాలి.

వ్యాధి లక్షణాలు

- జ్వరం 104 నుంచి 106 డిగ్రీలు పారన్‌హీట్ ఉంటుంది
- పశువు మేత మేయదు. నెమరు వేయదు. నోటిలో బొబ్బలు పగిలి చొంగకారుతుంది.
- కాలి గిట్టల మధ్య బొబ్బలు ఏర్పడి పుండ్లుగా మారుతాయి.
- పాడి పశువుల్లో రొమ్ములపై, పొదుగులపై బొబ్బలు ఏర్పడి పొదుగు వాపునకు గురవుతాయి
- ఆవులు, గేదెలు గర్భధారణ శక్తి కోల్పోతాయి.
- మేకలు,గొర్రెలు, పందులకు కూడా ఈ వ్యాధి సోకుతుంది

ముందు జాగ్రత్తగా టీకాలు



గాలికుంటు వ్యాధి నివారణకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. గతంలో ఎన్నడూ లేని విధంగా జాతీయ పశువ్యాధి నియంత్రణ పథకం కింద టీకా కార్యక్రమం నిర్వహిస్తుంది. ముందు జాగ్రత్తగా పాడిరైతులు ఆవులు,ఎద్దులు,గేదెలకు గాలికుంటు టీకా వేయించాలి. ఈ నెల 31 వరకు ఈ టీకాలను ఉచితంగా వేస్తున్నాం. నాలుగు నెలలు దాటిన ప్రతి పశువుకు ఈ టీకా వేయించాలి. అలాగే గాలికుంటు వ్యాధి లక్షణాలు ఉన్నట్లైతే ప్రభుత్వం టోల్ ఫ్రీ నంబర్ 155251కు లేదా ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో సమాచారం ఇవ్వాలి.

–ఎం.నవీన్,పశువైద్యాధికారి,కొరటమద్ది



చర్మంపై బొబ్బలు



గెట్టెలలో పుండ్లు

అంగరంగ వైభవంగా..

లక్ష్మీమాధవుడి గజోత్సవం

కోడుమూరు రూరల్: మండలంలోని గోరంట్ల గ్రామంలో శ్రీలక్ష్మీమాధవస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామి అమ్మవార్ల గజోత్సవం, శిఖికోత్సవ సేవ నిర్వహించారు. ఉత్సవమూర్తులైన స్వామి అమ్మవార్లను గజవాహనంపై ఆశీనులు చేసి డప్పుచప్పుళ్లు, మేళతాళాల మధ్య గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. గజవాహనానికి ముందు గోరంట్ల వాసులు, వెనుక ఎర్రగుడి వాసులు నిలబడి పోటా పోటీగా స్వామి వారి గజోత్సవ కార్యక్రమాన్ని ఎంతో కోలాహలంగా నిర్వహించారు.



గోరంట్లలో శ్రీలక్ష్మీమాధవుడి గజోత్సవం నిర్వహిస్తున్న గ్రామస్తులు

భక్తిశ్రద్ధలతో...

ఖాజాహుసేన్ గంధోత్సవం

కోడుమూరు రూరల్: వర్కూరులో శ్రీసద్గురు ఖాజా హుసేన్ దాస్ దర్గా ఉత్సవాలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. శనివారం తెలవారుజామున భక్తిశ్రద్ధలతో గంధం ఊరేగింపు నిర్వహించారు. మేళతాళాలు, గొరవయ్య నృత్యాలు, ఫకీర్ల విన్యాసాల మధ్య పీఠాధిపతి సద్గురు ఖాజా సుభాహన్ హుసేన్‌దాస్ ఇంటి నుంచి దర్గా వరకు ఈ కార్యక్రమం సాగింది. మధ్యాహ్నం దర్గాకు విచ్చేసిన భక్తులకు స్వామి వారి శిష్య బృందం అన్నదానం నిర్వహించింది.



ఊరేగింపుగా గంధం తీసుకెళుతున్న దృశ్యం

ఎన్నికల మాన్యువల్‌ను క్షుణ్ణంగా చదవాలి

- రిటర్నింగ్ అధికారి, జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల మాన్యువల్‌ను క్షుణ్ణంగా చదివి అర్థం చేసుకోవాలని రిటర్నింగ్ అధికారి, జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి అన్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్ విధులకు హాజరయ్యే అధికారులకు శనివారం ఉద్యాన్‌భవన్‌లో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల మాన్యువల్‌ను చదివి అర్థం చేసుకొని కౌంటింగ్ చేపట్టాలన్నారు. అప్పుడు ఎలాంటి తప్పులు దొర్లకుండా ఉండే అవకాశం ఉంటుందన్నారు. కౌంటింగ్‌లో భాగంగా మొదట పోస్టల్ బ్యాలెట్ ఓట్లను లెక్కించాలన్నారు. తర్వాత బ్యాలెట్ పేపర్లను కట్టలుగా కట్టి పోలింగ్ స్టేషన్ల వారీగా డ్రమ్ము ఇన్‌చార్జ్‌కి అప్పగించాలన్నారు. అనంతరం అభ్యర్థుల వారీగా ఓట్లను లెక్కించాలన్నారు. కాగా మాస్టర్ ట్రైనీ, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి కౌంటింగ్ ప్రక్రియపై సిబ్బందికి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎన్నికల కౌంటింగ్ సిబ్బందికి 14వ తేదీన మరోసారి శిక్షణ ఇస్తామని చెప్పారు. కార్యక్రమంలో డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జేసీ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి

14న 'ఇమాం ఏ ఆజం అబూ హనీఫా'

- సర్వమానవాళి శాంతి కోసం కాన్ఫరెన్స్‌లు

కర్నూలు(రాజ్‌విహార్): ఇమాం ఏ ఆజం అబూ హనీఫా రజిఅల్లాహు అన్హు జీవిత చరిత్రపై ఈ నెల 14వ తేదీన సమావేశం నిర్వహించనున్నట్లు సెంట్రల్ మిలాద్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ షా షఫీ పాషా ఖాద్రీ అన్నారు. శనివారం స్థానిక పాతబస్తీలోని ఆ సంఘం కార్యాలయం మిలాద్ మహల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సర్వమానవాళిని శాంతి వైపు నడిపేందుకు కాన్ఫరెన్స్‌లు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా అహలే సున్నతుల్ జమాత్, సెంట్రల్ ఈద్ మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 7గంటలకు (మగ్రీబ్ నమాజు తరువాత) బుధవారపేట బ్రిడ్జి వద్ద ఉన్న ఎంఎస్ ఫంక్షన్ హాలులో గొప్ప బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి జామియా నిజామియా నక్షబంది, ఖతీబే హిందుస్తాన్ అల్లమా మౌలానా మొహమ్మద్ అహ్మద్, ప్రముఖ మత గురువు మౌలానా ఆసిపుద్దీన్ ఖాద్రీ హాజరై ప్రసంగించనున్నారని వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ముస్లింలు ఈ సభకు హాజరై ఆధ్యాత్మికతను పెంపొందించుకొని అల్లాహ్ మార్గంలో నడుచుకోవాలని కోరారు. సమావేశంలో రోజా దర్గా పీఠాధిపతి సయ్యద్ దాదా బాషా ఖాద్రీ, అహలే సున్నతుల్ జమాత్ కమిటీ ప్రతినిధి సయ్యద్ మాసుం పీర్ ఖాద్రీ, మహబూబ్ బాషా, మొహమ్మద్ జుబేర్ ఖాద్రీ, నజీర్ ఖాద్రీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సయ్యద్ షా షఫీ పాషా ఖాద్రీ

యోగాకు మంచి ఆదరణ

కర్నూలు (టౌన్): దేశవ్యాప్తంగా యోగ క్రీడకు మంచి ఆదరణ ఉందని స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియం చీఫ్ కోచ్ నటరాజరావు అన్నా రు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ, జిల్లా యోగ సంఘం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యోగ పోటీలు నిర్వహించారు. విజేతలుగా నిలిచిన మనుశ్రీ ధనశ్రీ (7 నుంచి 12 సంవత్సరాలు), లావణ్య, కుమారి (12 నుంచి 15 సంవత్సరాలు), అక్షర, పుష్పవతి (15 నుంచి 25 సంవత్సరాలు), ప్రసన్న, లలిత, సుప్రియ(25 సంవత్సరాలు పైబడిన)లకు బహుమతులు అందజేశారు. జిల్లా క్రీడాప్రాధికార సంస్థ సీఈఓ రమణ, రాష్ట్ర యోగ సంఘం ప్రధాన కార్యదర్శి అవినాష్ శెట్టి పాల్గొన్నారు.

క్రీడల్లోనూ ప్రతిభ చాటాలి

కర్నూలు (టౌన్): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో ప్రతిభ చాటాలని మెడికవర్ హాస్పిటల్ కార్డియాలజీ వైద్య నిపుణులు డాక్టర్ ప్రవీణ్ అన్నారు. శనివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఆర్చరీ లెవల్ వన్‌ప్రాథమిక శిక్షణ కోర్సు ప్రారంభమైంది. ఈ శిక్షణ శిబిరాన్ని జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షులు రామాంజనేయులుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఎంచుకున్న క్రీడాంశంలో రాణించాలన్నారు.

సుంకేసులకు ఇన్ ఫ్లో

గూడూరు: సుంకేసుల జలాశయానికి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. శనివారం ఎగువ నుంచి 710 క్యూసెక్కుల నీరు చేరింది. కేసీ కాల్వకు 705 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. డ్యాంలో ప్రస్తుతం 0.719 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

పోలింగ్ కేంద్రం పరిశీలన

గడివేముల: ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు స్థానిక జిల్లాపరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని శనివారం తహసీల్దార్ శ్రీనివాసులు పరిశీలించారు. మండలంలో 942 మంది పట్టభద్రులు, 43 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఎన్నికల నిర్వహణకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తహసీల్దార్ చెప్పారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి

- ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పాణ్యం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద పాణ్యం, గడివేముల నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి పట్టభద్రులు, ఉపాధ్యాయ, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థులకు పట్టం కట్టాలన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి లక్షలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారన్నారు. అలాగే ప్రజలు అవసరమైన అన్ని రకాల సేవలను గ్రామాల్లోనే అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ జెట్పీటీసీ సభ్యుడు సద్దల సూర్యనారాయణరెడ్డి, గడివేముల జెట్పీటీసీ ఆర్‌బీ. చంద్రశేఖర్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, నాగేశ్వరరెడ్డి, శివారెడ్డి, వైస్ ఎంపీపీలు వెంకటేశ్వర్లు, పార్వతమ్మ, బాబు, సుబ్బరాయుడు, శేషారెడ్డి, రామంద్రుడు, కృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఉసేన్‌సా, జాకీర్ ఉసేన్, ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, ఎల్లగౌడ్ చిన్న ఎల్లసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓర్వకల్లు: శాసన మండలి ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరచిన అభ్యర్థులను గెలిపించాలని సచివాలయ మండల కన్వీనర్ మొల్ల మహ్మద్ అనీఫ్ అలియాస్ లోటర్‌బాషా ఓటర్లను అభ్యర్థించారు. శనివారం ఆయన కాల్వ గ్రామంలో ప్రచారం చేశారు. గ్రామ సర్పంచు కేపీ వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



జనరిక్ మందులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

జనరిక్ మెడికల్‌షాప్ ప్రారంభం

పాణ్యం: పాణ్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన జనరిక్ మందుల షాప్‌ను శనివారం ఎమ్మెల్యే కాటసాని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇలాంటి మెడికల్‌షాప్‌లలో ప్రజలకు తక్కువ ధరకే నాణ్యమైన మందులు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో మాజీ జట్పీటీసీ సద్దల సూర్యనారాయణరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, ఉప సర్పంచ్ పాలం చంద్రశేఖర్‌రెడ్డి, చిన్నన్న, బాబు, రాజన్న, గౌడ్, ప్రతాప్‌రెడ్డి, కృష్ణారెడ్డి, నారాయణ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనతతో ఆరోగ్య సమస్యలు

కోడుమూరు రూరల్: రక్తహీనతతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని అనిమియా ముక్తభారత్ స్టేట్ టీం సభ్యులు సాయికుమార్, రామచంద్ర అన్నారు. శనివారం వారు కోడుమూరులోని ఆరోగ్య కేంద్రాలను సందర్శించి రక్తహీనతతో బాధపడుతున్న వారి వివరాలు, అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం వారు మాట్లాడుతూ రక్తహీనత వల్ల గర్భిణులు కాన్పు సమయంలో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. ముందుగానే వారికి ఐరన్ మాత్రలు ఇవ్వాలన్నారు. అవసరమైతే రక్తాన్ని కూడా ఎక్కించాలని లద్దగిరి వైద్యాధికారిణి నస్రీన్, వైద్యసిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ శాంత, సూపర్‌వైజర్ లక్ష్మి, ఎన్ఎం శిరీషా, సిబ్బంది పాల్గొన్నారు.



వైద్య సిబ్బందితో చర్చిస్తున్న అనిమియా ముక్త భారత్ స్టేట్ టీం సభ్యులు

రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి

కర్నూలు: సురక్షిత ప్రయాణం కోసం ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం సూచించారు. కర్నూలు నగరంలోని ముఖ్యమైన ప్రదేశాల్లో మోటర్ వాహన చట్టం ఉల్లంఘనపై శనివారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా రాజ్‌విహార్ సెంటర్‌లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించి ద్విచక్ర వాహనాలపై త్రిబుల్ రైడింగ్, లైసెన్స్ లేకుండా తిరుగుతున్న 35 మంది మైనర్లపై కేసు నమోదు చేసి రూ.53,720 జరిమానా విధించారు. సాయంత్రం పట్టుబడిన మైనర్లతో పాటు వారి తల్లిదండ్రులను కొత్తపేట దగ్గర ఉన్న ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. త్రిబుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్ వల్ల జరిగే అనర్థాలను ఉదాహరణలతో డీఎస్పీ వివరించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చిన యజమానులకు చట్టాల ప్రకారం రూ.25 వేలు జరిమానా, మూడు సంవత్సరాల జైలు శిక్ష పడుతుందని హెచ్చరించారు. అలాగే మైనర్లకు మూడు నెలలు జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా ఉంటుందన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

కోడుమూరు రూరల్: పట్టణంలోని బాలికల హైస్కూల్‌లో జగనన్న గోరుముద్ద పథకం కింద విద్యార్థినులకు పెడుతున్న మధ్యాహ్న భోజనాన్ని శనివారం మధ్యాహ్నం ఎంఈఓ అనంతయ్య తనిఖీ చేశారు. ఆహార పదార్థాల రుచి చూశారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ పిల్లలకు మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డించాలని సూచించారు. వండే ఆహారం ప్రతి రోజు నాణ్యంగా ఉండాలని చెప్పారు. అనంతరం పదవతరగతి విద్యార్థినులతో సమావేశమై ప్రణాళికతో పరీక్షలకు ప్రిపేర్ కావాలని సూచించారు. సమయాన్ని చక్కగా సద్వినియోగం చేసుకుని మంచి మార్కులు తెచ్చుకోవాలన్నారు. ఈ సారి వందశాతం ఉత్తీర్ణత సాధించాలని హెచ్‌ఎం నాగరాజకుమారిని ఎంఈఓ సూచించారు.



ఆహార పదార్థాల వడ్డింపును పరిశీలిస్తున్న ఎంఈఓ

మునుగాలలో పాఠశాల తనిఖీ

గూడూరు రూరల్: మండలంలోని మునుగాల గ్రామం జెడ్పీ ఉన్నత పాఠశాలను శనివారం ఎంఈఓ సునీలమ్మ తనిఖీ చేశారు.పాఠశాల రికార్డులు, ఉపాధ్యాయుల హాజరు పట్టీ పరిశీలించారు. ఈ నెల 21 నుంచి విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో రాగిజావ ఇవ్వడానికి కావలసిన సరుకుల గురించి అడిగి తెలుసుకున్నారు.

పురుగుల నియంత్రణలో పక్షులు కీలకం

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ, ఉద్యాన పంటల్లో పురుగులు, చీడపీడల నియంత్రణలో పక్షులు కీలకమని ఆత్మ డిప్యూటీ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీలత అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని వ్యవసాయ శాఖ సమావేశ మందిరంలో దేశీ డిప్లొమా కోర్సు కింద ఇన్‌పుట్ డీలర్లకు వ్యవసాయ, ఉద్యాన పంటలకు పక్షుల వల్ల కలిగే లాభనష్టాలను వివరించారు. పంటల్లో పురుగుల బెడదను నివారించుకునేందుకు కర్రలతో పక్షి స్థావరాలు ఏర్పాటు చేసి పొలంలో పసుపు కలిపిన అన్నం, బొరుగులు చల్లాలని తెలిపారు. కర్రలపై వాలిన పక్షులు నేలపై చల్లిన అన్నం, బొరుగులు తినేందుకు వెళ్లి పురుగులను కూడా తినేస్తాయన్నారు. పంటలు కంకిదశ, కాయదశలో ఉన్నప్పుడు పక్షుల వల్ల నష్టం జరుగుతుందన్నారు. ఒకే పొలంపై ఎక్కువ సంఖ్యలో పక్షులు వాలి గింజలు తినడం వల్ల నష్టం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. అటువంటి సమయంలో పక్షుల బెడదను తగ్గించుకునేందుకు చనిపోయిన పక్షులను పొలంలో వేలాడదీయడం, మెటాలిక్ రిబ్బన్‌లు ఏర్పాటు చేయడం, టేపు రికార్డులతో సౌండ్ చేయడం, దిష్టి బొమ్మలు పెట్టడం చేయాలన్నారు. కాగా ఇన్‌పుట్ డీలర్లకు దేశీ డిప్లొమా కోర్సుపై మధ్యంతర పరీక్షను నిర్వహించారు.

కోనసీమను తలపించేలా..

ఎస్సార్బీసీ ఆయకట్టు కింద సాగు చేసిన వరిపైర్లు కళకళలాడుతున్నాయి. కనుచూపు మేర పచ్చందం సంతరించుకుని కోనసీమను తలపిస్తున్నాయి. గత రెండు మూడేళ్లుగా పుష్కలంగా వర్షాలు కురుస్తుండటంతో గోరుకల్లు జలాశయం నీటితో తొణికిసలాడుతోంది. కాలువలు గలగల పారుతున్నాయి. దీంతో ఆయకట్టు కింద రెండో పంటగా సాగు చేసిన వరిపైర్లు కనువిందు చేస్తున్నాయి. –పాణ్యం



కొండజుటూరు, గోరుకల్లు సమీపంలో కళకళలాడుతున్న వరిపైర్లు



ఎస్సార్బీసీ ప్రధాన కాల్వకు వదిలిన నీరు



నిండుగా గోరుకల్లు జలాశయం